క్లుప్తంగా

హిందీ విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ



పుస్తకాలు, హాల్ టికెట్లతో హిందీ విద్యార్థులు, మండలి ప్రతినిధులు

తగరపువలస : భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు ఆదివారం విద్యార్థులకు హాల్ టికెట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు.

ఈ నెల 10, 11న దక్షిణ భారత హిందీ ప్రచార సభ – చెన్నై ఆధ్వర్యంలో పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే వివిధ ఉద్యోగాలకు హిందీ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. జాతీయ భాష హిందీపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలని సూచించారు.

మద్దిలపేట ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు

తగరపువలస : భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మద్దిలపేటలో రెండు చెరువుల మధ్య ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన కొందరు నిర్మాణాలు చేపడుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు 500 గజాల స్థలంలో అక్రమ నిర్మాణాలకు తీవ్ర ప్రయత్నాల్లో భాగంగా ఇటీవల మెటీరియల్ డంప్ చేసినట్టు తెలిపారు. ఈ విషయం పంచాయతీ వీఆర్వో దృష్టికి తీసుకొచ్చినా స్పందించడం లేదని అంటున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై సోమవారం భీమిలి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు మద్దిలపేట గ్రామస్తులు తెలిపారు.

టెన్నిస్ కోర్టు ప్రారంభం



టెన్నిస్ కోర్టు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు, తదితరులు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టును ఆదివారం వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో పింఛన్ అందజేత



సత్యవతికి పింఛన్ అందిస్తున్న తాటితూరు వలంటీర్ గాయిత్రి

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు పంచాయతీకి చెందిన ముత్యాల సత్యవతి అస్వస్థత కారణంగా గత కొద్ది రోజులుగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతుంది. ఆమెకు వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలు తాటితూరు సచివాలయం వలంటీర్ భాగం గాయిత్రి ఆదివారం కేజీహెచ్‌లో అందించింది.

ఈ సందర్భంగా సత్యవతి కుటుంబ సభ్యులు, పంచాయతీకి చెందిన వీఆర్వో పల్లంటి శ్యామ్ సుందర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిల గురునాయుడు తదితరులు వలంటీర్ గాయిత్రిని అభినందించారు.

ఆటోవాలాలకు కొండంత భరోసా

'వాహనమిత్ర'తో నియోజకవర్గంలో 5,404 మందికి ప్రయోజనం



రాములమ్మ థియేటర్ వద్ద నిలిపిన ఆటోలు



ప్రయాణికులతో భీమిలి వెళ్తున్న ఆటో

తగరపువలస: ప్రజా రవాణాలో బస్సుల తర్వాత విరామం లేకుండా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆటో, టాక్సీ, మ్యాక్సీ కాబ్‌లదే కీలక పాత్ర. సొంత కాళ్లపై నిలబడాలనుకునేవారు ఎక్కువగా ఎంచుకునే ఈ ఉపాధి రంగంలో ప్రతీ గ్రామం నుంచి పదుల సంఖ్యలో కార్మికులు ఉన్నారు. సొంతంగా వాహనాలు సమకూర్చుకోలేనివారు అద్దె ప్రాతిపదికన ఆటోలు, ట్యాక్సీలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. సొంత ఆటోలు ఉండి నడుపుకోలేని వారు కూడా వీటిని అద్దెకు ఇవ్వడం ద్వారా హాయిగా జీవిస్తున్నారు. ఏటా స్థిర ఖర్చులలో భాగమైన ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ తదితర ఖర్చులే గత ప్రభుత్వాల హయాంలో ఈ కార్మిక సోదరులకు భారంగా ఉండేవి. ఈ బాధలను గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా వీరి కష్టాలను విని వాహనమిత్ర పథకం ద్వారా ఏటా రూ.10వేలు ఇవ్వడానికి హామీ ఇచ్చారు. ఒట్టి హామీయే కాకుండా ఈ అయిదేళ్లలో అయిదు సార్లు అర్హులైన ప్రతి ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్‌ల యజమానులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున వారి ఖాతాల్లో జమ చేశారు.

భీమిలిలో 5404 మందికి ప్రయోజనం

భీమిలి నియోజకవర్గంలో వాహనమిత్ర ప్రయోజనం 2019 నుంచి ఇప్పటి వరకు అయిదు విడతల్లో 5,404 మంది కార్మికులకు రూ.27.02 కోట్లు జమ చేశారు. వీరిలో భీమిలి మండలం నుంచి 921, పద్మనాభం 597, ఆనందపురం 1154, జీవీఎంసీ భీమిలి జోన్ 1072, మధురవాడ జోన్ 1660 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ లబ్ధితో ఏటా తమ వాహనాలకు ఫిట్‌నెస్, బీమా, పొల్యూషన్ తదితర పెట్టుబడి ఖర్చులు పోను రూ.2 వేల నుంచి రూ.2500 వరకు మిగిలినట్టు కార్మికులు తెలిపారు.

జగనన్న మిత్రుడయ్యారు



వాహనదారులకు ఏటా రూ.10 వేలు ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ పథకానికి వాహనమిత్ర అని పేరు పెట్టి ఆయనే మాకు మిత్రుడయ్యాడు. ఆయన సహకారం మరువలేనిది. ప్రతిపక్షాల విమర్శలు అర్థం లేనివి. ఎవరూ మమ్మల్ని ఇలా ఆదుకోలేదు.

– నీలాపు రామిరెడ్డి, చిట్టివలస

స్థిర ఖర్చులు గట్టెక్కుతున్నాయి



వాహనం నడిపితే వచ్చే కిరాయితో డీజిల్, మరమ్మతులు ఒడ్డెక్కుతాయి. వాహనం నడపకపోయినా బీమా, పొల్యూషన్, ఫిట్‌నెస్ ఖర్చులు ఏటా తప్పనిసరి. వీటిని సకాలంలో చేయించుకునేందుకు సీఎం వైఎస్ జగన్ ఇస్తున్న రూ.10 వేలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– ఎరుసు అప్పలరెడ్డి, ఎరుసుపేట

విమర్శలకు తావులేదు...



వివక్షకు తావు లేకుండా వాహనదారులకు వాహనమిత్ర లబ్ధి జమ చేస్తున్నారు. ఇందులో పార్టీలు, కులమతాలు, ప్రాంతాలు చూడలేదు. ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. కార్మికుల కష్టాలు గుర్తించి వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్న జగనన్న గ్రేట్.

– చిల్ల రాజశేఖరరెడ్డి, తగరపువలస

ప్రభుత్వం మేలు మరువలేం



ఆటో, టాక్సీ కార్మికులకు కష్టాలు ఉంటాయని గుర్తించిన మొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. మేము ఓటు వేశామా..? లేదా..? అన్నది చూడలేదు. ఏటా ఒక్కసారి వచ్చే ఖర్చులు భరించలేక అప్పుల కోసం తిరిగే మా కష్టాలు తెలుసుకున్నారు. ఆయన మేలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేలు మరువలేము.

– మామిడి సాయికుమార్, గుడివాడ

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సీఐ తిరుపతిరావు

ఆనందపురం : క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని స్థానిక సీఐ టీవీ తిరుపతిరావు చెప్పారు. మండలంలోని లొడగలవానిపాలెం గ్రామానికి చెందిన పిన్నింటి రాజు అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన జ్ఞాపకార్థం తోటి స్నేహితులు క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. టోర్నమెంట్‌ను ప్రారంభించిన సీఐ తిరుపతిరావు మాట్లాడుతూ జీవితంలో వ్యాయామం ఎంతో అవసరమని, క్రీడలు ద్వారా ఆ శక్తిని పొందవచ్చని తెలిపారు. అలాగే విద్యతోపాటు క్రీడల్లో రాణించిన వారు ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. చిన్న వయస్సులోనే ప్రమాదంలో మృతి చెందిన రాజు సేవా తత్పరతను స్నేహితులు కొనసాగించాలని కోరారు. టోర్నమెంట్‌లో మొత్తం 60 జట్లు పాల్గొంటాయని, ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లొడగల రమణ, కోన శ్రీను, బమ్మిడి తారక్, గండ్రేటి సూర్యనారాయణ, లొడగల సురేష్, దేవర తాతబాబు, ఆకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లే క్యాన్సర్‌కు కారకాలు



వేములవలస జంక్షన్‌లో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీలో సంఘం సభ్యులు

ఆనందపురం : దురలవాట్ల వల్లే క్యాన్సర్ విజృంభిస్తోందని నవ్య ఆస్పత్రి క్యాన్సర్ వైద్య నిపుణురాలు నవ్య అన్నారు. కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని వేములవలసలో శనివారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య మాట్లాడుతూ సిగరెట్లు, గుట్కాలు, పొగాకు సేవించడం, మద్యపానం తదితర దురలవాట్లు వల్ల క్యాన్సర్ సోకే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. మంచి అలవాట్లను పాటించి, పౌష్టికాహారం తీసుకుంటే క్యాన్సర్ బారి నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, కారుణ్య ఫౌండేషన్ కార్యదర్శి కోన ప్రకాష్, గ్రామీణ వైద్యులు పి.సుధాకర్ రెడ్డి, పి.నారాయణరావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. నగరానికి చెందిన శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్యాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థుల అద్భుతంగా కూచిపూడి నృత్యం చేశారు. జానపద గీతాలకు హుషారుగా నృత్యం చేశారు. మోక్షిత, లిఖిత, సరళ, పద్మ, అనూహ్య, శన్విక, గామిని, శ్రీనంద, రిషిత, నవ్య, సారిక, సౌజన్య, కుశల నృత్యం చేయగా... మోహన లక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథ రెడ్డి కార్యక్రమం పర్యవేక్షించారు.

సంతపేటలో చిమ్మచీకట్లు



చిల్డ్రన్స్ పార్కు సమీపంలో రహదారిపై అలుముకున్న చీకట్లు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు రెడ్డి సంతపేటలో వీధిదీపాలు వెలగక చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. ఈ నెల 1, 2న వెలగని వీధిదీపాలు 3న జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెలిగాయి. మళ్లీ ఆదివారం మొరాయించాయి. దీంతో అంధకారం అలుముకున్న వీధుల్లో కుక్కలు పెట్రేగిపోతున్నాయి. నడచివెళ్లే వారితోపాటు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి పిక్కలు పట్టుకుంటున్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంతంలో తరచూ దొంగతనాలు కూడా జరుగుతున్నందున భీమిలి పోలీసులు ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తరచూ ఈ గ్రామంలో వీధిదీపాలు వెలగడం లేదు. కొండవాలు ప్రాంతం, చిల్డ్రన్స్ పార్కులు కూడా ఈ గ్రామంలో ఉన్నాయి. రోడ్డుకు ఒక పక్క జీవీఎంసీ చెత్త సేకరణ డబ్బా కూడా ఉంది. కన్నులు మూసుకున్నట్టుగా చీకట్లు ఈ మార్గంలో రాజ్యమేలుతుండడంతో పలువురు అయోమయానికి గురవుతున్నారు. సత్యనారాయణ కొండపై నుంచి విష పురుగులు కూడా గ్రామంలో సంచరిస్తుండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. వీధిదీపాల పునరుద్ధరణకు జీవీఎంసీ చర్యలు తీసుకోవాలని సంతపేట ప్రజలు కోరుతున్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లాజీ

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో రూ.18 వేల విలువైన క్రీడా దుస్తులను వైఎస్సార్‌సీపీ నాయకుడు మేరుగు ఎల్లాజీ స్టార్ బాక్సింగ్ క్లబ్ క్రీడాకారులకు ఆదివారం అందించాడు. ఈ సందర్భంగా ఎల్లాజీ మాట్లాడుతూ 30 మంది క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో వీటిని అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కోచ్‌లు వి.ఆదినారాయణ, సీహెచ్.ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



వుడా కాలనీ - వాంబేకాలనీ రోడ్డుపైనే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైరు

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డులో మిథిలాపురి వుడా కాలనీ – వాంబేకాలనీ రోడ్డులో సెంటర్ లైటింగ్ విద్యుత్ వైర్లు నేల పైనే నిర్లక్ష్యంగా పడేసి ఉన్నాయి. ఈ స్తంభాలకు వుడా కాలనీ, సుద్దగెడ్డ, పాత మధురవాడకు వెళ్లే దారిలో ఫ్యూజు బాక్సులు కూడా చేతికి అందే ఎత్తులో నెలల తరబడి తెరిచి వదిలేశారని, ఇవి ప్రమాదకరంగా వున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వైర్లపై ఉన్న ప్లాస్టిక్ తొడుగు ఏమాత్రం చెదిరినా పెను ప్రమాదం సంభవిస్తుందని అంటున్నారు. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

ఆరిలోవ: ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో రౌడీ షీటర్లు మరింత జాగ్రత్తగా సత్ప్రవర్తనతో మెలగాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆరిలోవ సీఐ గోవిందరావు హెచ్చరించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్‌లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ.. అనంతరం మొదటిసారిగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రుషికొండ, ఎండాడ, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, డెయిరీఫారం, రవీంద్రనగర్ తదితర ప్రాంతాలకు చెందిన 46 మంది రౌడీషీటర్లు, డెకాయిడ్లు, సస్పెక్టెడ్ షీట్లు తెరిచినవారు ఉన్నారు. వారిలో కొందరు జైల్లో రిమాండ్‌లో ఉండగా.. మిగతా సుమారు 30 మంది వరకు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వారంతా ఏవిధంగా మెలగాలి, ఎంత జాగ్రతగా ఉండాలి తదితర వాటి గురించి సీఐ తెలియజేశారు. ఎలాంటి గొడవల్లోనూ కలగచేసుకోకూడదని సీఐ సూచించారు. సమాజంలో మంచిగా ప్రవర్తించకపోతే పోలీస్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

ఎస్టీయూ జిల్లా కార్యదర్శి పైడిరాజు



రాజారావును సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

విశాఖ విద్య: ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా మారాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సౌత్ ఇండియా స్థాయి సైన్సు ఫెయిర్‌లో ఉపాధ్యాయ కేటగిరీలో రాష్ట్రం నుంచి మొదటి బహుమతి సాధించిన జిల్లాలోని గంగవరం జెడ్పీ హైస్కూల్ సైన్సు ఉపాధ్యాయుడు పి.రాజారావును ఘనంగా సన్మానించారు. సైన్సు పరిశోధనల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా, నిత్య విద్యార్థిలా సరికొత్త ప్రయోగాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇతర ఉపాధ్యాయులకు రాజారావు మాస్టారు కృషి స్ఫూర్తిదాయకమని అభినందించారు.

జిల్లా కార్యదర్శిగా పైడిరాజు

ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యదర్శిగా అడవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్న పైడిరాజు సేవలు జిల్లాలో మరింత వినియోగించుకునేలా కీలకమైన కార్యదర్శి పోస్టులో ఎంపిక చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



సిటీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్, నమ్మివానిపాలెం, ఆశిపాలెం గ్రామాల్లో ఆదివారం ప్రబోధ సేవా సమితి విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ప్రబోధానంద యోగీశ్వరుడు రచించిన వంద గ్రంథాల త్రైత సిద్ధాంత గ్రంథాలపై వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మతోపాటు యోగ అధ్యాయంలో పురుషోత్తమ ప్రాప్తి శ్లోకాలను వివరించారు. ప్రచారంలో హిందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, ప్రతినిధులు ఎస్.శ్రీనివాస్, వి.సురేష్, కె.లక్ష్మి, బి.అంకమ్మ, జి.సన్యాసి, కె.రాజు, కె.బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

70 ప్యాకెట్ల గంజాయి పట్టివేత

- స్పెషల్ బ్రాంచ్ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు
- కారు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా పాడేరు నుంచి నగరానికి తరలిస్తున్న గంజాయిని స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సహకారంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి ఏపీ39 ఎన్‌క్యూ 2485 నంబర్ గల కారులో గంజాయి తీసుకొచ్చి నగరంలోని తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో గల కేంద్రీయ విద్యాలయం వెనుక గేటు వద్ద పార్క్‌చేసి వెళ్లిపోయారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులతోపాటు ఏఎస్‌ఐ ఎం.గురునాథ్, హెడ్ కానిస్టేబుల్ కె.ఎస్.నాయుడు సమాచారంతో ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఒక వ్యాన్ సహాయంతో ఆ కారును ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అందులో 70 ప్యాకెట్ల గంజాయి(140 కిలోలు) ఉన్నట్టు గుర్తించారు. కారును సీజ్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు గుర్తించిన పోలీసులు సీసీ ఫుటేజ్‌లు పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రఘునాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

పర్యాటకులతో కిటకిట



రుషికొండ బీచ్‌లో పర్యాటకులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతాలు రుషికొండ బీచ్, సాగర్ నగర్, రామానాయుడు స్టూడియో, తొట్లకొండ, బావికొండ, భీమిలి బీచ్, ఎర్రమట్టి దిబ్బలు పర్యాటకులతో ఆదివారం కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకుల తాకిడి గణనీయంగా వుంది.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థం



పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.